పంచాయతీల్లో రైతుబజార్లు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆర్ఐడిఎఫ్, నాబార్డ్ గ్రాంట్ కింద గ్రామపంచాయతీల్లో రైతు బజార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్ఐడిఎఫ్, నాబార్డ్ గ్రాంట్ బేస్డ్ ప్రాజెక్టుల అమలుపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాబార్డ్ గ్రాంట్ కింద జీవనోపాధుల కల్పనకు విరివిగా అవకాశాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. దేవనకొండ క్రాస్ వద్ద ఉల్లి పంటకు సంబంధించిన రూరల్ హార్ట్ ఏర్పాటు చేయాలని హార్టికల్చర్ శాఖ అధికారిని ఆదేశించారు. కడప, చిత్తూరు జిల్లాల్లో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ విజయవంతంగా నడుస్తున్నాయని, అక్కడికి వెళ్లి అధ్యయనం చేయాలన్నారు. నాబార్డ్ గ్రాంట్‌తో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను రూరల్, అర్బన్ మార్ట్‌ల ద్వారా మార్కెటింగ్ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ, మెప్మా అధికారులను ఆదేశించారు. ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల్లో చేనేత ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నందున వీటిని మార్కెటింగ్ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

పేరుకే ఉచితం..!

- దాదాపు పాత ధరే పెట్టాల్సిన పరిస్థితి
- నేడు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం, నాయకులు ఉచిత ఇసుక ఇస్తున్నామని గొప్పలు చెప్పకుంటున్నా దాదాపు పాత ధరే వెచ్చించాల్సి వస్తోంది. ఉచిత ఇసుక పేరుకే పరిమితం అవుతోంది. టన్ను ఇసుకకు రూ.320, రవాణా కోసం వేలల్లో చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన రవాణా ఛార్జీల్లోనూ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో ఇసుక కొనుగోలుదారులపై భారం పడుతోంది. ఇసుకను ఉచితంగా ఇవ్వాలని శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నారు...

టిడిపి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం ఐదు డీ సిల్టింగ్ పాయింట్ల ద్వారా కొనుగోలుదారులకు ఇసుకను అందిస్తున్నారు. సి.బెళగల్ మండలంలోని కె.సింగవరం, ముడుమాల, ఈర్లదిన్నె, కొత్తకోట, గుండ్రేవులలో ఇసుక డీ సిల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఇసుక రవాణా సాగుతోంది. తొలుత టన్ను ఇసుక ధరను రూ.326గా నిర్ణయించారు. తవ్వకాలు, లోడింగ్ ఛార్జీల కోసం రూ.168, సీనరేజి, రాయల్టీ ఛార్జీ రూ.88, జిఎస్‌టి రూ.70 కలిపి టన్నుకు రూ.326 వసూలు చేసేవారు. తాజాగా జిఎస్‌టిలో రూ.6 మినహాయిచడంతో టన్ను ఇసుక ధర రూ.320కు చేరింది. ఆ ధరతో పాటు రవాణా కోసం కొనుగోలుదారులు రవాణా ఛార్జీని చెల్లించాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్ల వరకు 4.5 టన్నులు ఇసుక పట్టే ట్రాక్టర్‌కు రూ.1400, 10 టన్నుల ఇసుక పట్టే ఆరు టైర్లు ఉన్న లారీకి రూ.2 వేలు, 18 టన్నుల ఇసుక పట్టే 10 టైర్లు ఉన్న లారీకి రూ.3,600, 22 టన్నులు ఇసుక పట్టే 12 టైర్లు ఉన్న లారీకి రూ.3,840, 31 టన్నుల ఇసుక పట్టే 16 టైర్లు ఉన్న లారీకి రూ.4,480 చెల్లించాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్లు దాటికే ఒక టన్నుకు రూ.8, 18 టైర్ల లారీకి మాత్రం టన్నుకు రూ.7 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక ధర, రవాణా ఛార్జీల వివరాలు తెలిసేలా ఇసుక డీ సిల్టింగ్ పాయింట్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఇసుకను రవాణా చేసే వాహనాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీల కన్నా అదనంగా రవాణా ఛార్జీని వసూలు చేస్తున్నారు. 20 కిలోమీటర్ల లోపు ఇసుక రవాణాకు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీ రూ.1400 ఉండగా ఇసుక డీ సిల్టింగ్ పాయింట్ల నుంచి 20 కిలోమీటర్లు లోపు ఉన్న సి.బెళగల్ మండల కేంద్రానికి రూ.1900 నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నారు. 4.5 టన్నులు ఇసుక పట్టే ట్రాక్టర్‌కు ఇసుక కోసం రూ.1440, రవాణా ఛార్జీ కోసం రూ.1400 చొప్పున ట్రాక్టరు ఇసుకకు మొత్తం రూ.2840 మాత్రమే కొనుగోలుదారులు చెల్లించాల్సి ఉండగా రవాణా ఛార్జీ పేరుతో అదనంగా వసూలు చేస్తుండటంతో రూ.3340 నుంచి రూ.3500 వరకూ వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సి.బెళగల్‌కు ట్రాక్టరు ఇసుక రూ.3500 పడేది. ఇప్పుడు కూడా అదే ధర పడుతోంది. 20 కిలోమీటర్ల లోపు ఇసుక రవాణా కోసం లారీలకు అయితే ఏకంగా రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం 20 కిలోమీటర్లు దాటికే ఒక టన్నుకు రూ.8, 18 టైర్ల లారీకి మాత్రం టన్నుకు రూ.7 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉండగా ఇసుక రవాణా వాహనాల యజమానులు ఇష్టానుసారంగా రవాణా ఛార్జీలను వసూలు చేస్తున్నారు. ఇసుక కొనుగోలు దారులపై రవాణా ఛార్జీల అదనపు భారం పడుతోంది. కర్నూలుకు గతంలో ట్రాక్టరు ఇసుక రావాలంటే రూ.6వేలు అయ్యేది. ఇప్పుడు కూడా అదే మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నారు.

సింగవరం వద్ద లారీల్లోకి నింపుతున్న ఇసుక (ఫైల్)

భవన నిర్మాణ కార్మికులకు పస్తులే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. నిర్మాణ రంగంలో దాదాపు 36 రకాల పనులు చేసేవారున్నారు. బోర్లు తీసేవారు, రాడ్ బెండింగ్, తాపీ పని, సెంట్రింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రిషియన్లు, మార్బుల్స్ అతికేవారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, కాంక్రీట్ మిల్లర్లు, భవన నిర్మాణ కార్మికులు ఇలా వీరందరూ నిర్మాణ రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. వీరంతా రోజువారీ పనులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. తాపీ మేస్త్రీకి రూ.900 నుంచి రూ.వెయ్యి, పని చేసే కార్మికులకు రూ.500 నుంచి రూ.600 వరకూ కూలి ఉంటుంది. నెలంతా పని చేస్తేనే వీరికి ఇల్లు గడుస్తోంది. ఇసుక సరఫరా డిమాండ్‌కు సరిపడా లేకపోవడంతో కార్మికులు పనుల్లేక కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. ఆదాయం లేకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబాలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

ఉచిత ఇసుక వాగ్దానాన్ని అమలు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక విగ్దానాన్ని అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక అందించాలని కోరుతూ ఈనెల 4న అన్ని జిల్లా కలెక్టరేట్‌ల ముందు నిరసన చేపడుతున్నామని తెలిపారు. కొత్త ఇసుక పాలసీ తెచ్చి ఇసుకను బంగారం కంటే ఖరీదు చేసిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇంటికి పంపించారని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇసుకను ప్రజలకు ఉచితంగానే అందిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు వంద రోజులు గడిచినా ఎందుకు పాత రేటునే అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికీ ప్రజలకు ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పలుకుతోందని తెలిపారు. అది కూడా దొరకని పరిస్థితి ఉందన్నారు. ఇసుక దొరకక, ఇళ్ల నిర్మాణం జరగక భవన నిర్మాణ కార్మికులకు పని దొరికే పరిస్థితి లేదని తెలిపారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు పనులు కోల్పోతున్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇసుక రీచ్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, 2014-19 మధ్య ఏ ధరకు అయితే ఇసుక వస్తుందో దానిని అమలు చేయాలని కోరుతూ ఈనె 4న కర్నూలు కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఈ ధర్నాలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టండి

- కమిషనర్ రవీంద్రబాబు

మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో రహదారులు, వంతెనల గుండా ధ్వంసమైన ఫుట్‌పాత్‌లకు అవసరమైన మరమ్మతు పనులు చేపట్టాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. గురువారం రాజ్ విహార్, వడ్డేగిరి, ఆర్ఎస్ రోడ్డు, ఆనంద్ థియేటర్, కిసాన్ ఘాట్, బాపూజీ నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, పలుచోట్ల ధ్వంసమైన ఫుట్‌పాత్‌లను పరిశీలించారు. చిన్న, పెద్ద కాలువలు తేడా లేకుండా అన్ని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నా రు. ఆరోగ్యాధికారి డాక్టర్ వి.విశ్వేశ్వర్ రెడ్డి, డిఇఇ నరేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ముర్తుజావలీ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా ఓటరు జాబితా సర్వే

ఓటరు జాబితా సవరణకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా సర్వే చేపట్టాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు బిఎల్ఒలను ఆదేశించారు. నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఫారం 6, 7, 8ల పూరింపులపై అవగాహన కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత కొత్త ఓటుకు దరఖాస్తు, చనిపోయిన వారి ఓటు తొలగింపు, సవరణలు వంటివి తప్పొప్పులు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రెండు వారాల్లో ప్రక్రియ ముగిస్తుందని, అర్హులు, అనర్హులు, మార్పుచేర్పుల ప్రక్రియలో జాప్యం చేయవద్దని పేర్కొన్నారు. కర్నూలు తహశీల్దార్ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాషా, వాజీద్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

- జీర్ణించుకోలేక తల్లీ మృతి

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికెరలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎల్లిపోగుల వెంకటేష్ (53) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిని జీర్ణించుకోలేక తల్లి నారాయణమ్మ (80) మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి... మద్దికెర ఎస్సీ కాలనీకి చెందిన నారాయణమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమారుడు వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందారు. మృతిని జీర్ణించుకోలేక తల్లి నారాయణమ్మ 3 గంటల వ్యవధిలో మృతి చెందారు. వెంకటేష్ మరణ వార్త విన్న మిత్రులు వెంకటేష్ కుమారుడు రమేష్‌కు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మిత్రులు శ్రీకాంత్, లాల్, మల్లికార్జున, హుస్సేన్, అల్లీపీరా, వెంకట రాముడు, మాజీ సర్పంచి కొత్తపేట వెంకటేశ్వర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, టిడిపి నాయకులు ధనుంజయ యాదవ్ మృతుని కుటుంబానికి సానుభూతి తెలిపారు.

మృతి చెందిన వెంకటేష్, నారాయణమ్మ

సైబర్ నేరాల అడ్డుకట్టపై అవగాహన కల్పించండి

- డాక్టర్లతో సమావేశంలో ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలులోని గవర్నమెంట్, ప్రయివేటు ఆస్పత్రుల డాక్టర్లతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. సమస్యలు వచ్చినప్పుడు పోలీసులు ఎలా స్పందిస్తున్నారు, ఎలా పని చేస్తున్నారు అనే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మాదకద్రవ్యాల బారినపడి విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. శిక్షలు పడే విధానం గురించి తెలియజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెడిసిన్ కళాశాలలో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరం బారిన పడితే వెంటనే 1930 కి సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్ www.cyber-crime.gov.inలో ఫిర్యాదు చేయాలన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్, కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినర్సమ్మ, ఐఎంఎ ప్రెసిడెంట్ రామచంద్రనాయుడు, సెక్రటరీ రామ్ మోహన్ రెడ్డి, ట్రెజరర్ మాధవీ శ్యామల, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఖాజావలీ పాల్గొన్నారు.

హోంగార్డుల పిల్లలు స్ఫూర్తిగా నిలవాలి

- ఎస్పీ బిందు మాధవ్

- 38 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్ చెక్కులు

కర్నూలు జిల్లాలోని హోంగార్డు కుటుంబాలలోని విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలవాలని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో 38 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ చెక్కులను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ వివిధ కోర్సులలో ప్రతిభ కనబరచిన వారికి మెరిట్ స్కాలర్ షిప్‌లను అందించామన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమార్, హోంగార్డు డిఎస్పీ ఎస్.క్రిష్ణమోహన్, ఆర్ఐ జావేద్ పాల్గొన్నారు.

చెక్కులను అందజేస్తున్న ఎస్పీ బిందు మాధవ్

సాంకేతికత శస్త్ర చికిత్సలకు
కిమ్స్ భాగస్వామ్య ఒప్పందం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

తాము ఏర్పాటు చేసిన 25 కొత్త రోబోటిక్ సర్జరీ కార్యక్రమాలు తీసుకొచ్చేందుకు ఇని స్ట్యూటివ్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు కిమ్స్ హాస్పిటల్ చైర్మన్, డైరెక్టర్ డాక్టర్ బి.భాస్కరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ సామర్థ్యాలు విస్తరించేందుకు, వినిమల్లి ఇన్వా సివ్ కేర్ ద్వారా రోగులకు ఫలితాలు మెరుగు పరచడానికి కిమ్స్ హాస్పిటల్స్ నిబద్ధతలో ఒక ముఖ్యమైన దశను ఇనిస్టిట్యూవ్‌తో ఈ భాగస్వామ్యం సూచిస్తుందన్నారు. రోబోటిక్ సహాయక శస్త్ర చికిత్స వంటి అధునాత సాంకేతిక అవకాశాలను విస్తృతం చేయడం ద్వారా రోగుల సంరక్షణను మెరుగు పరచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తమ అనుబంధ కళాశాలలు, ఇనిస్టిట్యూట్లలోని వైద్య విద్యార్థులకు రోబోటిక్ సహాయక శస్త్ర చికిత్స అందించాలని తాము ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. ఇనిస్టిట్యూట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి గ్యారియస్ గుథార్ట్ మాట్లాడుతూ రోగి సంరక్షణను మెరుగుపరచడం, రోగులకు అధిక నాణ్యత, వినూత్నమై న మినిమల్లీ ఇన్వాసివ్ కేర్‌కు అవకాశాలను విస్తరించడం వంటి లక్ష్యాలను సాధించడంలో కిమ్స్ హాస్పిటల్స్‌కు మద్దతు తెలపడం ద్వారా ఇనిస్టిట్యూవ్ గౌరవంగా భావిస్తున్నామన్నారు. మెరుగైన ఆరోగ్య చికిత్స అవకాశాలు లేని ప్రాంతాలకు అధునాతన రోబోటిక్ టెక్నాలజీలు తీసుకురావడం తమ భాగస్వామ్య లక్ష్యమన్నారు.

ఒప్పంద పత్రాలు చూపుతున్న సిబ్బంది

సూర్యనారాయణ స్వామి ఆలయంలో
దేవి నవరాత్రుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

నగరంలోని శ్రీసూర్య నారాయణ స్వామి దేవాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీమహాగౌరీ అమ్మవారికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ టి.శివరామకృష్ణ తెలిపారు. అలాగే గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశనం, సర్వతోభద్ర మండల, యోగినిగణ మండప స్థాపనం, నవగ్రహ కలశ స్థాపనం, నవదుర్గా కలశ స్థాపనం, అంగ, ఉపాంగ, ప్రత్యంగ దేవతా సహిత లలితా త్రిపుర సుందరీ ప్రాధాన కలశస్థాపనం నిర్వహించామన్నారు. దేవీ ఖడ్గమాల, లలితా సహస్ర నామార్చనలు, అనంతరం చండీహోమం నిర్వహించారని తెలిపారు. సాయంత్రం ప్రదోష కాలంలో షోడశోపచార పూజ లలితా సహస్రనామార్చనలు నిర్వహించినట్లు చెప్పారు.

పూజలు చేస్తున్న భక్తులు

పార్టీ కోసం పని చేసిన వారికి న్యాయం

- టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక న్యాయం జరుగుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. ఎపి టూరిజంగా కార్పొరేషన డైరెక్టర్‌గా నియమితులైన షేక్ ముంతాజ్ గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డిని, కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారికి స్వీట్లు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ షేక్ ముంతాజ్, మహేష్‌కు నామినేటెడ్ పదవులు రావడం సంతోషకరమని, వారు చేసిన కృషికి, కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని అన్నారు. పదవికి వన్నె తీసుకురావాలని వారిని కోరారు. ముంతాజ్, మహేష్ భవిష్యతులో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. రాబోయే రోజులలో మరిన్ని నామినేటెడ్ పదవులను ప్రకటించడం జరుగుతుందని, అందులో జిల్లాకు మరిన్ని పదవులు వస్తాయని తెలిపారు. షేక్ ముంతాజ్ మాట్లాడుతూ తనకు పదవి రావడం కోసం సహకరించిన మంత్రి టిజి భరత్‌కు, జిల్లా టిడిపి అధ్యక్షులు తిక్కారెడ్డికి, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు సత్రం రామక్రిష్ణుడు, పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్షావలి, నాయకులు షమీ బాషా, శ్రీదేవి, లలిత, రేణుక పాల్గొన్నారు.

స్వీట్లు పంచి పెడుతున్న టిడిపి నాయకులు

బిఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బిఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్‌కు వారు వినతిపత్రాన్ని అందించారు. బీఎడ్ కళాశాలల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఏవిధంగా చేశారో అర్థం కావట్లేదని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కమిటీ సభ్యులు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని కళాశాలల యాజమా న్యాలతో కుమ్మక్కై అనుమతులు మంజూరు చేశారన్నా రు. పొరుగు రాష్ట్రాల విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వటమే కాకుండా వారికి తరగతులకు, బ్లాక్ టీచింగ్, ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్, తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. బిఎడ్ కళాశాలల అనుమతులను రద్దు చేయాలని అదేవిధం గా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూ రు చేసిన యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. వీసీ నాయక్ స్పందించి ప్రత్యేక కమిటీ వేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

టెట్‌కు1117 మంది హాజరు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో గురువారం నుండి టెట్ పరీక్ష ఆరు పరీక్ష కేంద్రాల్లో ప్రారంభమైంది. మొదటిరోజు జరిగిన పరీక్షకు 1117మంది అభ్యర్థులు హాజరు కాగా145 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొదటి సెషన్ పరీక్షకు 51 మంది అభ్యర్థులు, రెండవ సెషన్ పరీక్షకు 66 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా టెట్ పరీక్షకు 8.51 శాతం హాజరు నమోదు అయింది. ఈ పరీక్ష నిర్వహణను కర్నూల్ నగరంలో పలు పరీక్షా కేంద్రాల్లో రాష్ట్ర పరిశీలకులు నరసింహారావు, డీఈఓ కె.శామ్యూల్, అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్ పరిశీలన చేశారు.

'పొలం పిలుస్తోంది'ని వినియోగించుకోవాలి : ఎడిఎ

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కర్నూలు ఎడిఎ ఎన్.శాలురెడ్డి కోరారు. గురువారం మండలంలోని ముడుముల గుర్తి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఎడిఎ ఎన్.శాలు రెడ్డి, డిఆర్‌సి ఎడిఎ గిరీష్, ఎఒ ఎన్.రవి ప్రకాష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రదీప్ కుమార్, రెడ్డి రాంభూపాల్ రెడ్డి, సర్పంచి మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

'అభివృద్ధి'లో అలసత్వం తగదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మండలంలో అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకూడదని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. గురువారం ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి తిప్పన అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువల పనులు వంటి వాటిపై త్వరగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లోని గృహ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఎంపిడిఒ నాగ శివప్రసాద్, తహశీల్దార్ విద్యా సాగర్, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

లా, బిఇడి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ వర్సిటీ పరిధిలో జరిగిన 2023 విద్యా సంవత్సరానికి సంబంధించిన లా మొదటి సెమిస్టర్, బిఇడి మూడో సెమిస్టర్ ఫలితాలను గురువారం వైస్ ఛాన్సిలర్ ఎన్‌టికె.నాయక్ విడుదల చేశారు. మూడేళ్ల లా కోర్సులో మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలో 189 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 153 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడో సెమిస్టర్‌కు సంబంధించి 199 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 159 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదేళ్ల కోర్సుకు సంబంధించి మొదటి సెమిస్టర్‌కు 54 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడో సెమిస్టర్‌కు సంబంధించి 44 మంది విద్యార్థులకు గాను 37 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడేళ్ల లా కోర్సుకు సంబంధించి సప్లిమెంటరీ మొదటి సెమిస్టర్‌లో 38 మంది ఉత్తీర్ణులు కాగా మూడో సెమిస్టర్‌లో 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఐదేళ్ల లా కోర్సుకు సంబంధించి మొదటి సెమిస్టర్‌లో 9 మంది, మూడో సెమిస్టర్‌లో 21 మంది ఉత్తీర్ణులయ్యారు. బిఇడి మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలో 295 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ముగిసిన రగ్బీ ఛాంపియన్‌షిప్

- అండర్-19 ఎస్‌జిఎఫ్ రగ్బీ విజేత అనంతపురం జట్టు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు సాగిన అండర్-19 ఎస్‌జిఎఫ్ బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ముగిశాయి. 12 జిల్లాల నుంచి పాల్గొన్న బాలికల పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా జట్టుపై జరిగిన తుది పోరులో అనంతపురం జట్టు 20-0 ట్రైస్‌తో ఛాంపియన్‌షిప్ గెలుపొందింది. తూర్పుగోదావరి జట్టు రెండో స్థానంతో రన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మూడో స్థానం కోసం జరిగిన హార్డ్ లైన్ పోటీలో ఆతిథ్య కర్నూలు జిల్లా జట్టు పశ్చిమగోదావరి జట్టుపై 25-0తో సునాయాస విజయాన్ని కైవసం చేసుకుని కాంస్య పతకాలతో మెరిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి, ఆర్ఐఒ గురువయ్య శెట్టి, ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి బొల్లవరం రామాంజనేయులు, అండర్-19 ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సి.హర్షవర్ధన్ పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం రాష్ట్ర పోటీల పరిశీలకులు గణేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టును ప్రకటించారు.

సూక్ష్మ పోషకాల ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని రైతులకు సూక్ష్మ పోషకాల అవశ్యకతపై ఎఒ మల్లేష్ కుమార్ గురువారం అవగాహన కల్పించారు. గుండ్రేవులలో పొలాలను పరిశీలించి చీడ పురుగుల నివారణపై రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఇక్కడే రైతులు అధికారుల సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వ్యవసాయ సిబ్బంది కూడా రైతులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది వెంకటేశ్వర్లు, సంధ్య రాణి, సోమేశ్వరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

- సిపిఎం నగర కార్యదర్శులు రాముడు, రాజశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

టిడిపి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సిపిఎం నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు రైల్వే స్టేషన్ సర్కిల్, ఆర్ఎస్ రోడ్డు కూడలిలో ఉన్న భవన నిర్మాణ కార్మికులకు మట్టి పని మేస్త్రీలతో కలిసి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తామని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 4న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు హాజరయి జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఓల్డ్ సిటీ గడియారం హాస్పిటల్ దగ్గర మట్టి కార్మికుల అడ్డాలో భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలను అందజేశారు. సిపిఎం నగర నాయకులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్ఎమ్‌డి.షరీఫ్, ఖాజా పాషా హాజరయ్యారు. సిపిఎం నాయకులు మహబూబ్ షా, మూసా, మట్టి కార్మికుల నాయకులు వెంకటేశ్వర్లు, మల్కల్, ప్రమీల, ఈరమ్మ పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ

- ప్రజలకు సమాచారం ఇవ్వని అధికారులు - సబ్ కలెక్టర్ మండిపాటు

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని చిన్న హ్యాట గ్రామ శివారులోని ముగ్గురాయి పరిశ్రమ కోసం సర్వే నెంబర్ 194లో ఉన్న 3.70 హెక్టార్ భూమికి సంబంధించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ గురువారం చేపట్టారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి హాజరయి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణపై అధికారులు ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో చిన్నహ్యాట, పెద్దహ్యాట, బిజీ హళ్లి గ్రామాల ప్రజలు అతి తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. అధికారులు గ్రామానికి దూరంగా, క్వారీ ప్రదేశంలో సమావేశం ఏర్పాటు చేశారు. క్వారీ వల్ల కలిగే కాలుష్య సమస్యలు చెప్పుకునేందుకు మహిళలు, వృద్ధులు రాకపోవడంతో కొందరు గ్రామస్తులు సబ్ కలెక్టర్ ముందే అసహనం వ్యక్తం చేశారు. క్వారీ నుంచి దుమ్ము, ధూళితో పాటు బ్లాస్టింగ్ చేసేటప్పుడు చుట్టుపక్కల ఉన్న పొలాల రైతులకు సమాచారం అందించాలని కోరారు. శశి మైనింగ్ సొల్యూషన్ సంస్థ గతంలో రైతులతో ఒప్పందం చేసుకున్న ప్రకారం డబ్బులు చెల్లించలేదని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని యువతకు పనులు కల్పించాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణకు వివిధ జిల్లాల నుంచి ఎన్‌జిఒలు, పర్యావరణ పరిరక్షణ సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తహశీల్దార్ ఎఎం.ప్రసాద్ రాజు, చిన్నహ్యాట సర్పంచి యేసన్ ఉల్లా, ఎంపిటిసి శివన్న, టిడిపి నాయకులు తాయప్ప, కురువ చిన్న మల్లికార్జున, నాగ భీరప్ప, మంజునాథ్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి

మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలో టిడిపి శ్రేణులకు, ప్రజలకు ఇక నుంచి అందుబాటులో ఉంటామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు నియోజకవర్గం నుంచి పార్టీ టిక్కెట్ కోసం ప్రయత్నించామని తెలిపారు. అనివార్య కారణాల వల్ల, అధిష్టానం మాటకు కట్టుబడి తన సోదరులు జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. ఇక నుంచి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని, అధైర్య పడొద్దని బరోసా ఇచ్చారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు అండగా ఉన్న ప్రతి ఒక్కరీ సేవలు మరువలేనివని తెలిపారు. అలాంటి వారు గుర్తున్నారని చెప్పారు. ఎవరికి ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, విద్యాకమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ, నాయకులు వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, హండే అనుమంతు, చిన్న భీమ, గోవిందు, గనేకంటి రఘు, గనేకంటి రామకృష్ణ, వనికె భీమేష్, వర్ధిరాజులు, పౌలు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కౌతాళం

అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండలంలోని బదినే హాళ్ గ్రామంలో పత్తి, మిరప పంట తెగుళ్లపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. 'పొలం పిలుస్తోంది' అనే కార్యక్రమానికి డిఆర్‌సి ఎడిఎ వెంకటేశ్వర్లు, ఆదోని డివిజన్ ఎడిఎ అరుణ కుమారి, కెవికె బనవాసి శాస్త్రవేత్తలు మౌనిక, డిఆర్‌సి వ్యవసాయ అధికారి శశిధర్, హార్టికల్చర్ ఆఫీసర్ హరేంద్ర, ఎఒ శేషాద్రి పాల్గొని పంటలను పరిశీలించారు. ఇందులో భాగంగా మొదట గ్రామ సభ నిర్వహించి, పొలానికి వెళ్లి రైతులకు పొలంలో పత్తి, మిరప పంటలకు రైతులను తీసుకెళ్లి అందులోని సస్యరక్షణ చర్యలు గురించి, ఇతర పురుగు, తెగుళ్లపై అవగాహన కల్పించారు.

ఆగిన బిల్లు..!

- నిలిచిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం - రూ.33 కోట్లతో చేపట్టనున్న కాంప్లెక్స్

ఆదోని పట్టణంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితులు అన్ని వ్యవస్థలపై ప్రభావితం చూపుతున్నాయని పురవాసులు పేర్కొంటున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అనుచరుడు కావడంతో కావాలనే బిల్లు నిలిపారని విమర్శలు ఉన్నాయి. నిర్మాణాలు ఆగి బీమ్స్ వరకే పరిమితమయ్యాయి.

ప్రజాశక్తి-ఆదోని

బీమ్స్‌కే పరిమితమయిన నిర్మాణం

పాత బస్టాండు మైదానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి భూమి పూజ చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల కోసం రూ.33 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. పనులు సజావుగా ప్రారంభమయ్యాయి. పనులను పరవేక్షించి త్వరలోనే పనులు పూర్తవుతాయని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.

కాంప్లెక్స్ నిర్మాణం ఇలా...

పునాది మట్టం గట్టి నేల వచ్చే వరకు తవ్వకాలు జరిగాయి. పునాది గట్టిగా ఉన్నప్పుడే నిర్మాణం ఎక్కువ కాలం నిలుస్తుందని ఇంజనీర్ల సూచన మేరకు పనులు మొదలయ్యాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో సుమారు 180 గదులు నిర్మాణం జరగాల్సి ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో 77, ఫస్ట్ ఫ్లోర్‌లో 77, సెకండ్ ఫ్లోర్‌లో 26 చొప్పున దుకాణాల నిర్మాణానికి డిజైన్ రూపకల్పన చేశారు. ఒక్కో బ్లాక్‌లో రెండు టాయిలెట్ల చొప్పున నిర్మిస్తూనే లిఫ్ట్ సదుపాయం ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఫ్లోర్‌కు 5 ఎగ్జిట్, ఎంట్రీస్ ఉండేలా రూపకల్పన చేశారు. అగ్రిమెంటు కాలం ముగిసేలోపు దుకాణాల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని నిర్ణయించారు. పనులు నిలిచి ఆరు నెలలవుతోంది. కాంట్రాక్టర్ మాత్రం పట్టించుకోవడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది.

నిలిచిన పనులు

షాపింగ్ కాంప్లెక్స్ కోసం లబ్ధిదారుల వాటా కింద రూ.మూడు కోట్ల వరకు చెల్లించినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. వారి భాగస్వామ్యంతో కాంప్లెక్స్ కోసం రూ.33 కోట్లు అవసరమని టెక్నికల్ శాంక్షన్ కూడా అయిందని పనులు మొదలు పెట్టారు. తమకు దుకాణాలు వస్తాయని కార్యాలయం చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

రాజకీయాలే కారణమా

రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితుల వల్ల ఆదోనిలో కూటమి తరపున బిజెపి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్నికల ఫలితాలు వెలవడిన ప్రారంభంలో పనులు జరిగాయి. గ్రౌండ్ లెవెల్ నుంచి బీమ్స్ వరకు పనులు జరిగాయి. సజావుగా పనులు జరుగుతున్నాయి అనుకుంటున్న నేపథ్యంలోనే బ్రేక్ పడింది. దీనికి రాజకీయ కారణాలా, సాంకేతిక కారణాలు అన్నది అర్థం కాని పరిస్థితి. అధికారులను అడిగితే పొంతన లేని సమాధానం వస్తోందని డిపాజిట్ చెల్లించిన వారు చెబుతున్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసు

పనులు ఉన్నపలంగా నిలిపేయడం ఏమిటని, సమాధానం చెప్పాలని కాంట్రాక్టర్‌కు నోటీసు పంపినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పనులు జరిగిన దానికి రూ.3 కోట్ల వరకు బిల్లు చెల్లించాల్సి ఉందంటూ అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు కాంట్రాక్టర్ నుంచి సరైన సమాధానం రాలేదని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. కాంప్లెక్స్ నిర్మాణానికి సరిపడా ఇసుక దొరకకపోవడంతో పనులు నిలిపేశారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. డబ్బు చెల్లించిన వారు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎప్పుడో అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి చొరవ చూపి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఆరు నెలలుగా పనులు జరగకపోవడంతో కాంట్రాక్టర్‌ను రద్దు చేయాలని పలువురు కోరుతున్నారు. లబ్ధిదారులు వాటా చెల్లించినా అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషించడం శోచనీయమంటూ మండిపడుతున్నారు.

పనులు మొదలు పెట్టాలి

- సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న

అధికారుల అలసత్వం కారణంగానే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఆగాయి. లబ్ధిదారులు వాటా చెల్లించి ఏడాది గడిచింది. ఇసుక కొరత సాకు చూపి కాంట్రాక్టర్ పని నిలిపారని పొంతన లేని సమాధానం చెప్పడం తగదు. ఎమ్మెల్యే కక్ష సాధింపు ధోరణి ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. అధికారులు బాధ్యత తీసుకొని అగ్రిమెంట్ ప్రకారమే పనులు చేయించి లబ్ధిదారులకు న్యాయం చేయాలి. లేకపోతే లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తాం.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

- నేడు ఆదోని మార్కెట్ యార్డులో ధర్నా
- హాజరు కానున్న ప్రభాకర్‌రెడ్డి
- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పత్తి పంటను రైతులు గణనీయంగా సాగు చేశారని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో పంటలు బాగా వచ్చాయని, పత్తిని తీసి మార్కెట్ తీసుకొస్తే గిట్టుబాటు ధర లేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏడాది పత్తికి క్వింటాకు రూ.7,521 మద్దతు ధరగా ప్రకటించిందని తెలిపారు. వ్యాపారులు రూ.6,500కు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితికి పురుగుమందులు, విత్తనాలు, కూలీలు, ఎరువులు సేద్యం అన్నీ కలుపుకున్నా క్వింటా రూ.10 వేల ధర ఉంటే రైతుకు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తక్షణమే మార్కెట్‌లో ప్రవేశించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల నుంచి క్వింటా రూ.10 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని పత్తి మార్కెట్ యార్డును రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి సందర్శిస్తారని తెలిపారు. మార్కెట్‌లో ధర గురించి తెలుసుకుని పత్తి క్వింటాకు రూ.10 వేలు ఇవ్వాలని, మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. పత్తి వేసిన రైతులందరూ శుక్రవారం మార్కెట్ యార్డులో ధర్నాలో పాల్గొనాలని కోరారు.

విండ్ పవర్ ఆధిపత్యం కోసం...

- గుంతకల్ ఎమ్మెల్యే వర్సెస్ ఆలూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో ప్రయివేట్ విండ్ పవర్ సంస్థలు నిర్వహిస్తున్న సిబ్బంది నియామకాల్లో గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ గ్రూపు, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి గ్రూపు మధ్య గురువారం రగడ చోటు చేసుకుంది. గతంలో ఆలూరు వైసిపి ఎమ్మెల్యేగా ఉన్న గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ కాంట్రాక్టర్‌గా ఉంటూ ఆయన పరిధిలోని విండ్ పవర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గుమ్మనూరు జయరామ్ టిడిపిలోకి వెళ్లి గుంతకల్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుత ఆలూరు ఎమ్మెల్యేగా ఉన్న విరుపాక్షి గ్రూపు ఆలూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న విండ్ పవర్‌లో తమకు చెందిన కొంతమంది సిబ్బందిని విధులోకి తీసుకోవాలని విండ్ పవర్ సంస్థలకు తెలిపినా స్పందించకపోవడంతో ఆయా సబ్ స్టేషన్లకు తాళాలు వేసినట్లు తెలిసింది. గుమ్మనూరు సోదరులు శ్రీనివాసులు, నారాయణ మొలగవల్లి విండ్ పవర్ సబ్ స్టేషన్‌కు వెళ్లి విరుపాక్షి గ్రూపు దాడి చేసినట్లు తెలుపుతున్నారని తెలిపారు. పోలీసులు రెండు గ్రూపులపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహబూబ్ బాష

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులు తమను తామే అభివృద్ధి చేసుకుని, ఉన్నతస్థాయికి ఎదగాలని శ్రీమహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మహబూబ్ బాష తెలిపారు. గురువారం స్వర్ణాంధ్రప్రదేశ్-2047 కార్యక్రమాన్నిచరిత్ర అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హెచ్.కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ మహబూబ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధన మన చేతుల్లోనే ఉందని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ... అభివృద్ధి అనేది గ్రామాల నుంచి జరగాలని తెలిపారు. కళాశాల ఐక్యూఎస్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుశీలమ్మ మాట్లాడుతూ... విద్యార్థులు తమను తాము అభివృద్ధి పరుచుకుంటూ దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. చరిత్ర అధ్యాపకులు డాక్టర్ హెచ్.కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధనకు సలహాలు, సూచనలు అనే అంశంపై కళాశాల తరపున నిర్వహించిన వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించి కళాశాల అధ్యక్షులు, అధ్యాపకుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు లక్ష్మన్న, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ మహబూబ్ బాష

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం

- ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భారత రాజ్యాంగం ప్రతి పౌరునికీ అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల పునాదులను కాపాడుతూనే కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడతామని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం పేర్కొన్నారు. గురువారం కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నాలుగిండ్ల గేరి, క్రాంతి నగర్‌లోని కెవిపిఎస్ కార్యాలయంలో కెవిపిఎస్ జెండావిష్కరణలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వృత్తి చర్మకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంతోని, సుమాల రాజు, కలుగొట్ల వైస్ ప్రెసిడెంట్ రాజా రమేష్, రంగన్న, మున్సిపాలిటీ నాగరాజు, నల్లన్న, బజారి, సామ్యేల్, అనిల్, సుమాల బాలు, ఆనంద్, సుధా పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం సూగూరు గ్రామంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు ఈరన్న, కార్యదర్శి అంజి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. మాజీ ఉప సర్పంచి గోపీనాథ్, కెవిపిఎస్ గ్రామ అధ్యక్షులు దేవదానం, సీనియర్ నాయకులు ఆంజనేయ, చర్మకారుల సంఘం గ్రామ అధ్యక్షులు దేవదాసు, దేవ సహాయం, జై పాలు, దుబ్బన్న, సుజ్ఞానం, అంబేద్కర్ యూత్ నాయకులు దినకర్, జనార్ధన్, ఎజ్రా, శాంతిరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గాలి మరల ఆఫీసు, సిబ్బందిపై దాడి

- 23 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని జిల్లేడు బుడకల గ్రామ శివారులోని గాలి మరల కార్యాలయ ఫర్నీచర్, సిబ్బందిపై ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అనుచరులు గురువారం దాడి చేశారు. గాలి మరల నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆలూరు, పత్తికొండ, దేవనకొండ సిఐలు శ్రీనివాస నాయక్, జయన్న, వంశీనాథ్, ఆలూరు ఎస్ఐ నరసింహులు, పోలీసు సిబ్బంది దేవనకొండ క్రాస్ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే సోదరుడు వెంకటేష్, 22 మంది అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఆలూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అదుపులోకి తీసుకుంటున్న సిఐ

ధ్వంసమైన ఫర్నీచర్

ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్

ఆదోని ఎంపిడిఒగా రాజేంద్ర ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కోసిగి ఎంపిడిఒగా పనిచేస్తున్న రాజేంద్ర ప్రసాద్‌ను ఆదోనికి బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన గీతావాణిని ఆస్పరికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. ఎఇ మాలిక్, కార్యాలయ సిబ్బంది వీరభద్రప్ప, అభి, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, నాగరాజు ఎంపిడిఒను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. **ఆస్పరి** ఎంపిడిఒగా గీతావాణి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆదోనిలో ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న గీతావాణి బదిలీపై ఆస్పరికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రాణెమ్మ కోసిగి మండలానికి బదిలీపై వెళ్లారు. గీతావాణి గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు. అనంతరం ఎంపిడిఒ గీతావాణికి ప్రజాప్రతినిధులు, సిబ్బంది శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.



ఆస్పరి ఎంపిడిఒ గీతావాణి

విద్యుత్ ఎఇగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆస్పరి

కర్నూలు రూరల్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయ శాస్త్రి గురువారం బదిలీపై ఆస్పరి విద్యుత్ ఎఇగా బాధ్యతలు చేపట్టారు. ఆస్పరిలో విధులు నిర్వహిస్తున్న ఎఇ మల్లికార్జున ఆదోనికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయ శాస్త్రి మాట్లాడారు. రైతులు, ప్రజలకు విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు. అనంతరం విద్యుత్ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.

చదువుకు పేదరికం అడ్డుకారాదు

- ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి ఆల్ఫ్రెడ్ రాజు
- పేద దళిత వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి : ఎమ్మిగనూరు

చదువుకు పేదరికం అడ్డు కారాదని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విద్య, వైద్య రంగాల్లో రాణించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, ఎంఇఒ ఎం.ఆంజనేయులు, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న తెలిపారు. గురువారం గాంధీనగర్‌లోని ఆల్ఫ్రెడ్ రాజు స్వగృహంలో నీట్ ఎంట్రెన్స్ పరీక్షల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించిన పేద దళిత విద్యార్థులను అభినందించారు. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన మల్లెపోగు అద్భుత్ కుమార్, నందవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన మంచాల సునీల్ కుమార్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఐదేళ్ల డాక్టర్ కోర్సుకు ఏటా రూ.10 వేల చొప్పున చెరో రూ.50 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. మొదటి సంవత్సరానికి గాను ఇద్దరికీ రూ.10 వేల చొప్పున తన సతీమణి మల్లెల సునీల ఆల్ఫ్రెడ్ రాజు, ఆయన తనయుడు డాక్టర్ మల్లెల మహిత్ చేతులమీదుగా అందజేశారు. అలాగే దళిత, బహుజన వ్యాసకర్త, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందజేసి అభినందనలు తెలిపారు. అల్వాల గ్రామానికి చెందిన యువకులు శిఖామణి, కిరణ్ కుమార్ నాయకులను, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేద దళిత కుటుంబాల్లో జన్మించిన అద్భుత్ కుమార్, సునీల్ కుమార్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో చదువుతూ కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడి ఎంబిబిఎస్ సీట్లు సాధించడం గొప్ప విషయమని తెలిపారు. వీరికి ఆర్థిక సహాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ రోజా ఆర్ట్స్ ఉసేని, ఉపాధ్యాయులు రంగన్న, మల్లెల గ్రూప్ సభ్యులు జడ రవి, ముత్తు, న్యూ లైఫ్ సామ్యేల్, అజిత్, సతీష్, హనుమంతు, గంగా, యుఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్, అనిల్, భవిత వికలాంగుల పాఠశాల ఉపాధ్యాయులు పార్లపల్లి బాబు పాల్గొన్నారు.



పేద వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఆల్ఫ్రెడ్ రాజు

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మంత్రాలయంలో

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు దేవీ శరన్నవరాత్రులను గురువారం కలశ స్థాపన, పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. శ్రీమఠంలో జరిగిన సంస్థాన పూజతో పాటు దేవీ పూజలు నిర్వహించారు. శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠానికి చెందిన పండితులు, విద్యార్థులు వేద మంత్రాలతో దుర్గా సూక్తం పఠించారు. అనంతరం గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని మంచాలమ్మకు మంగళ హారతి ఇచ్చారు.

శీలపుత్రి అలంకరణలో దొండు మారెమ్మ

ప్రజాశక్తి - ఆదోని

దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నెట్టేకల్ గ్రామానికి వెళ్లే రోడ్డులో వెలసిన దొండు మారెమ్మ అవ్వ ఆలయంలో గురువారం మొదటి రోజు అమ్మవారు శీలపుత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. దొండు మారెమ్మ అవ్వ ఆలయ వంశస్తులు సున్నంబట్టి లక్ష్మన్న, కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పది రోజుల పాటు అమ్మవారు రోజూ ఒక అలంకరణలో దర్శనమిస్తారని, భక్తులు తరలిరావాలని నిర్వాహ కులు కోరారు. **కౌతాళం** మండలం ఉప్పరహాల్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని మారెమ్మ దేవాలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పసుపు కుంకుమ అలంకారంలో లక్ష్మమ్మ అవ్వ దర్శనం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం పట్టణంలో వెలిసిన శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ పసుపు కుంకుమ అలంకారంలో దర్శనమిచ్చారు. రాచోటి రామయ్య, రాచోటి సుబ్బయ్య ధర్మకర్తల ఆధ్వర్యంలో ఘనంగా పూజలతో కార్యక్రమం ప్రారంభించారు. పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున అవ్వను దర్శించుకున్నారు.

'గురురాఘవేంద్ర' రైతులను ఆదుకోవాలి

- మాజీ కౌన్సిల్ కోనేరు నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల కింద సాగులో ఉన్న రైతులను ఆదుకోవాలని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తుంగభద్ర నది ఒడ్డున నిర్మించిన గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం జరగడం, దొంగలను పోలీసులు పట్టుకోవడం తెలిసిందేనని తెలిపారు. దాదాపు రూ.3 కోట్లు మంజూరయితే మళ్లీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు తెచ్చి నీటి సరఫరాను పునరుద్ధరించి రైతులకు సాగునీరు ఇవ్వవచ్చని చెప్పారు. ఇంత డబ్బును తక్షణం మంజూరు చేయించాలంటే స్థానిక ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బీవీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకొని కూడా రెండు నెలలు కావస్తోందని తెలిపారు. ఈ మధ్యలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కర్నూలు వచ్చినప్పుడు అందుకు తగినట్లు ఎమ్మెల్యే ప్రతిపాదనలు చేసినట్లు కనిపించలేదని విమర్శించారు. రెండు రోజుల క్రితం చంద్రబాబు నాయుడు పత్తికొండ నియోజకవర్గంలో పర్యటించినా ఎమ్మెల్యే బీవీ ఇందుకు సంబంధించి ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. రైతుల నుంచి కొందరు నాయకులు ఎకరాకు రూ.3 వేలు వసూలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసిందని అన్నారు. ఇందుకు రైతులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. రైతుల్లో చైతన్యం వచ్చినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించే విధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయంపై విమర్శిస్తే విమర్శించిన వారిపై చిల్లర విమర్శలు చేయిస్తూ రాజకీయం చేయడం ఎమ్మెల్యేకే చెల్లిందన్నారు. ఇలాంటి మైండ్ గేమ్ రాజకీయాలను వదిలి ఎమ్మెల్యే చిత్తశుద్ధితో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పందించకుండా రైతులను నిరాశకు గురి చేస్తున్నారని తెలిపారు. తక్షణం రూ.3 కోట్లు మంజూరు చేసి మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో రైతులను ఆదుకోవాలని కోరారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించే
విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దసరా సెలవుల్లో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని, అందుకు విద్యాశాఖ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నెల 3 నుంచి 13 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిందని ఎలతిపారు. కొన్ని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయకుండా ప్రత్యేక తరగతుల పేరుతో పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అలాంటి విద్యా సంస్థలకు నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మధు, శశిధర్, ప్రతాప్, యశ్వంత్, మధు, సూరి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

మహారాజు శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ.పి.నెం. 29/2023

బి.శివకుమార్. ...అర్జీదారు

-ఎదురి-

సునీత సుధాకర్ వగైరా. ...రెస్పాండెంట్లు

రెండవ రెస్పాండెంట్ కు నోటీసు

(2).పి.మహేష్ తండ్రి తిక్కయ్య
ఇంటి. నెం.49-1-2-87-జె6,
బిలాల్ మసీద్ దగ్గర, లక్ష్మీ నగర్, కర్నూలు టౌన్.

పై నెంబర్ ఐ.పి లో అర్జీదారు అయిన బి.శివకుమార్ తండ్రి బి.కిష్టన్న, ఇంటి. నెం.46-153-డి6-2, బుధవారపేట, కర్నూలు అను నతడు తనను దివాలాదారుగా తీర్మానింపమని కోరుతూ పై కోర్టులో దివాలా అర్జీ దాఖలు చేసియున్నాడు. ఇందులో రెండవ రెస్పాండెంట్ అయిన నీకు పలుమార్లు నోటీసులు పంపిన నీవు తీసుకోలేదని అందువలన ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. రెండవ రెస్పాండెంట్ అయిన నీకు ఏదైనా ఆక్షేపన ఉన్న నీవు గాని నీ తరపు వకీలు గాని 16-10-2024వ తేదీ పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొన వలెను లేని యడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

ఎం.మురళీమోహన్ రెడ్డి,
ఎం.పుష్పలలితమ్మ,
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.